క్లుప్తంగా

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో విద్యార్థులతో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం

శంకర్‌పల్లి: విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం పాషా అన్నారు. గురువారం మోకిలలోని క్రీడా ప్రాంగణంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. సెలవుల్లో విద్యార్థులు నచ్చిన ఏదైనా క్రీడను ఎంచుకొని, నిష్ణాతులైన కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరం ఇన్‌చార్జి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏగా నిషాంత్‌కుమార్



నిషాంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

షాద్‌నగర్: షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ గురువారం ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఏఓగా అనుభవం కలిగిన ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఏడీఏను నియమించేంతవరకు ఆయన ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సివిల్ జడ్జిలకు సన్మానం



సివిల్ జడ్జి మణివీర్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్: ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షా ఫలితాల్లో పట్టణానికి చెందిన మణివీర్, మధులిక తేజ ఉత్తమ ప్రతిభ కనబరి జూనియస్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం న్యాయవాదులు వారిని ఘనంగా సత్కరించారు. విధుల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, న్యాయవాదులు కంచి రాజ్‌గోపాల్, అబ్దుల్ కరీం, చెంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబిక ఆలయంలో సుదర్శన యాగం



సుదర్శన యాగం చేస్తున్న సేవా ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి: ప్రధాని మోదీ, ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తో పోరాడుతున్న సైనికుల సంక్షేమం కోరుతూ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం అంతప్పగూడలో గల భ్రమరాంబిక ఆలయంలో సుదర్శన యాగం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ రక్షణకు ప్రధాని మోదీ, సైనికులు నిరంతరం ఎంతో శ్రమిస్తున్నారని, వారు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేనేంద్రాచారి,రవి,నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

సన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ చేవెళ్ల మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్నూరు శ్రీకాంత్‌ను ఆ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయనను కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, వెంకట్రామిరెడ్డి, నాయకులు కృష్ణమోహన్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు భవనాలు కరువు

అరకొర వసతులు.. అద్దె భవనాల్లో కొనసాగింపు

- పాలకవర్గానికి తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కాశీంబౌలిలో యువజన సంఘంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయం

మొయినాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కమ్యూనిటీ హాళ్లలో కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. దీంతో పంచాయతీ పాలకవర్గానికి తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలనను అందించాలనే సంకల్పంతో నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. కానీ పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. కాగా వాటిలో కనీస వసతులు లేని కారణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో 21 గ్రామ పంచాయతీలు

మండలంలో 2011 లెక్కల ప్రకారం 21 గ్రామ పంచాయతీలు ఉండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కొత్తగా మరో ఏడు గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో మొత్తం 28 అయ్యాయి. రెండు నెలల క్రితం మండలంలో 28లో ఎనిమిది గ్రామ పంచాయతీలు కొత్త మున్సిపాలిటీలో కలిసిపోయాయి. ప్రస్తుతం 20 గ్రామ పంచాయతీల పాలన సాగుతోంది.

నాలుగు జీపీలకే నిధులు మంజూరు

నూతనంగా ఏర్పడిన ఎత్‌మార్‌పల్లి, అప్పారెడ్డిగూడ, అప్పోజిగూడ, ఎల్కగూడ గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో నిధులు మంజూరైనా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఈ నాలుగు జీపీల్లో కేవలం అప్పోజిగూడ గ్రామంలో నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. కానీ ఎత్‌మార్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కొనసాగుతోంది. మిగతా రెండు గ్రామాలు ఎల్కగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో భవన నిర్మాణానికి స్థలం లేక ఆగిపోయింది. అదేవిధంగా కాశీంబౌలి, మోత్కుపల్లి, కుత్బుద్దిన్‌గూడ గ్రామ పంచాయతీలకు అసలే నిధులు మంజూరు కాలేదు. దీంతో నాలుగు సంవత్సరాలు అవుతున్నా కొత్త గ్రామ పంచాయతీలు భవనాలకు నోచుకోలేకపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు లేవు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలన సౌకర్యార్థం సుమారు 500 జనాభా ఉన్న అనుబంధ గ్రామాలను పంచాయతీలుగా మార్చింది. వీటితో పాటే ప్రత్యేక అవసరాల దృష్ట్యా మరికొన్ని గ్రామాలను అనుబంధ గ్రామాలుగా చేసింది. కాగా నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కొత్తగా ఏర్పడిన జీపీలకు సొంత భవనాలు లేవు. యూత్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో పంచాయతీలు కొనసాగుతున్నాయి. పాత, కొత్తగా ఏర్పడిన ఆయా పంచాయతీ కార్యాలయాల్లో కనీస వసతులు తాగునీరు, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. జీపీల్లో సమావేశాలు, ఇతర కార్యక్రమాలు వచ్చే ప్రజలు కూడా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నిధులు మంజూరు చేయాలి



కొత్తగా ఏర్పాటైన కాశీంబౌలి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం యువజన సంఘం భవనంలో ఇబ్బందిగా పాలన సాగుతోంది. గత ప్రభుత్వంలో మా గ్రామాన్ని జీపీగా ఏర్పాటు చేసినప్పటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. ఈ ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించాలి.

–మాడి వెంకట్‌రెడ్డి, కాశీంబౌలి

అధికారులకు తెలియజేశాం



మండలంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణానికి నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. అప్పట్లో నాలుగు జీపీలకే నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం అప్పోజిగూడలో నూతన భవనం పూర్తయి పాలన కొసాగుతోంది. ఎత్‌మార్‌పల్లిలో భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. అప్పారెడ్డిగూడ, ఎల్కగూడ గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనానికి స్థలాలు లేక సమస్యగా మారింది.

–సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

నిధులు మంజూరు కాలేదు



మండలంలోని కొత్తగా ఏర్పడిన ఏడు జీపీలకు అప్పట్లో అధికారులు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు తీర్మానాలు చేసి పంపించారు. కానీ ప్రభుత్వం ద్వారా నాలుగు జీపీలకే నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరైతే పనులు చేపట్టేందుకు కృషి చేస్తాం.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

డివైడర్ల తొలగింపుపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్: పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో ఉన్న డివైడర్లు, చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం పలువురు కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సునితకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాలనీ అభివృద్ధి పేరుతో కొందరు డివైజర్లు, చెట్లు తొలగించారని పేర్కొన్నారు. కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సింది పోయి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే నష్టం జరుగుతుందని ఆరోపించారు. ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఆర్డీఓ సరిత, తహసీల్దార్ పార్థసారధికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసి హరిభూషణ్ పటేల్ తెలిపారు.

షాబాద్ ప్రత్యేకాధికారిగా డాక్టర్ బాబుబేరీ



బాబుబేరీని సన్మానిస్తున్న అధికారులు

షాబాద్: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వెటర్నరీ, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాబుబేరీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా షాబాద్ మండల కార్యాలయంలో ఆయనకు అధికారులు స్వాగతం పలికి సన్మానించారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి



రావిర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చలివేంద్రంపల్లి, రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో జైబాపు, జైబీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ను జైబీమ్ అంటే బీజేపీ ప్రభుత్వానికి గిట్టదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగంతోనే సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు గౌరవం దక్కుతుందన్నారు. అంబేడ్కర్, గాంధీ చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి గాంధీ ఫొటోలతో, రాజ్యాంగ పుస్తకాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం భారత సైనికులు పాకిస్థాన్‌పై ప్రదర్శిస్తున్న తీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు, కొందుర్గు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు తాండ్ర విశాల, పిట్ట రజిత, సత్యానారాయణరెడ్డి, ఆంజనేయులు, రామచంద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు జీవాలకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీసీలు ఐకమత్యంగా ఉండాలి

బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్



నూతన మహిళా కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న ప్రశాంత్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి, వనంపల్లి గ్రామాల్లో గురువారం బీసీ సేన ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పస్పుల ప్రశాంత్ హాజరై మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా సామాజిక న్యాయం జరిగేవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. బీసీలు ఏకమైతే రాజ్యాధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా మహిళా కమిటీలను నియమించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులకు నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు జయ, కార్యదర్శి లావణ్య, మమత, నవనీత, అనిత, రమాదేవి, అనుసూయ, లక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: భూభారతి చట్టం పూర్తిస్థాయిలో అమలు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం మండలంలోని పర్వతాపూర్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న ప్రతీ రైతు దరఖాస్తులు అందజేయాలన్నారు. అధికారులు రైతుల అర్జీలను వీలైనంతవరకు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. పర్వతాపూర్‌లో 25 దరఖాస్తులు అందాయని ఈ సందర్భంగా తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరిత, సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, ఆర్‌ఐ శివకుమార్, సర్వేయర్ ఆంజనేయులు, సిబ్బంది దశరథ, హరీశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో చీడపీడల నివారణ

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో అవగాహన



కుమ్మెరలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల: పంట మార్పిడితో చీడపీడల నివారణ జరుగుతుందని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ వి.రమ్య, డాక్టర్ వి.కవితాకిరణ్, స్నేహలత, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ప్రమీల అన్నారు. మండలంలోని గొల్లపల్లి, కుమ్మెర గ్రామాల్లో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగుకు సంబంధించిన పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయనాలను అవసరాన్ని బట్టి వాడడంతో పాటు పుట్టగొడుగుల పెంపకంతో రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు. పంట మార్పిడి చేయడంతో లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శంకర్‌లాల్, ఏఈఓలు బాలకోటేశ్వర్, కుమారి ప్రతిభ, పంచాతీయ కార్యదర్శులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు అందించాలి

సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ నరేందర్‌రెడ్డి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించాలని సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ కర్రేడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరుతూ ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులతో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని తెలిపి కాంగ్రెస్ నాయకులతోనే వేశారన్నారు. ఈ కమిటీ కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి పార్టీలతో సంబంధం లేకుండా అందించాలని ఆయన కోరారు. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయకుంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోటే శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వీరేందర్‌నాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత




హనుమయ్యకు స్కూటీని అందిస్తున్న సత్యనారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: దివ్యాంగుడైన స్నేహితుడికి స్కూటీ అందించి దాతృత్వం చాటుకున్నాడు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి. మున్సిపాలిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం నాలుగు చక్రాల స్కూటీని దివ్యాంగుడైన స్నేహితుడు హనుమయ్య దంపతులకు ఆయన అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలల క్రితం చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81 బ్యాచ్ విద్యార్థులందరం కలిసి నిర్వహించుకున్న సమ్మేళనంలో తమతో పాటు చదువుకున్న అల్లవాడ గ్రామానికి చెందిన కావలి హనుమయ్య దివ్యాంగుడు కావడంతో అతడికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అతడి అవసరం గుర్తించి సొంత డబ్బులతో స్కూటీ అందజేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అతడికి 1లక్ష 30వేల రూపాయలతో కొత్త స్కూటీని కొనుగోలు చేసి తమ పూర్వ విద్యార్థుల సమక్షంలోనేఆలయం వద్ద పూజలు చేయించి హనుమయ్య దంపతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవాగుణాన్ని తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్ కుమార్, సంతోష్ గుప్తా, యాదయ్య, ఖాజాపాష, రాములు, శంకరయ్య, ప్రభులింగం, మల్లయ్య, వెంకటయ్య, జనార్దన్, గోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములు, చంద్రయ్య, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు రాఘవులు, అరుణ్, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కాశన్నకుంట.. అభివృద్ధి లేదంట!

- పూడికతో నిండుకున్న చెరువు
- కాలుష్య జలాలతో రంగుమారిన నీరు
- మినీట్యాంక్‌బండ్‌లా మార్చాలని స్థానికుల విన్నపం
- పట్టించుకోని అధికారులు



కాశన్నకుంట చెరువులో కలుషిత జలాలు చేరడంతో రంగుమారిన నీరు

కొత్తూరు: కొత్తూరు పట్టణం రోజురోజుకు అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో ఇప్పటికే పంచాయతీగా కొనసాగుతున్న కొత్తూరును అధికారులు మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణంలో పలు రకాల పరిశ్రమలు కొనసాగుతుండడంతో బీహార్, ఒడిశా, రాజస్థాన్‌తో పాటు ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం పట్టణంలో 16 వేల జనాభా ఉండగా.. అనాధికారికంగా 20వేలకుపైన ఉంటుంది. కాగా పట్టణంలో ఉన్న చెరువుల రక్షణను మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కాశన్నకుంట చెరువును అభివృద్ధి చేస్తే మినీట్యాంక్ బండ్‌లా మారుతుంది. ఇక్కడ ప్రజలు కాలక్షేపంతో పాటు వాకింగ్, ఇతర ఉపయోగాలు ఉన్నాయి. అయినప్పటికీ నివాస గృహాలకు ఆనుకొని ఉన్న కాశన్నకుంట చెరువు అభివృద్ధి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు.

రంగుమారుతున్న నీరు

మండల పట్టణంలోని ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల్లో కాశన్నకుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఒకప్పుడు 30 ఎకరాల ఆయకట్టు ఉండేది. వర్షాకాలంలో ఈ చెరువు నిండితే వ్యవసాయ బోర్లే కాకుండా గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోర్లలో కూడా నీటిమట్టం పెరిగేది. తద్వారా వేసవిలో కుడా అంతగా నీటి ఇబ్బందులు ఉండేవి కావు. స్థానిక మత్స్యకారులు ప్రతి ఏడాది లక్షల రూపాయలు వెచ్చించి చేపలను సాగు చేసేవారు. కానీ మండల కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటైన తర్వాత క్రమేణా కొన్ని పరిశ్రమలు కాలుష్య కారకమైన నీటిని వర్షాకాలంలో వరద నీటితో పాటు చెరువులోకి వదులుతున్నారు. దానికి తోడు పట్టణంలోని మురుగు నీరు చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువులో నీరు రంగుమారి దుర్వాసన వస్తోంది.

మరమ్మతులు చేపట్టాలి



కాశన్నకుంట చెరువుకు అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలి. గత కొన్నేళ్ల నుంచి కనీస మరమ్మతులు లేని కారణంగా చెరువు పూడిక పేరుకుపోయింది. దానికి తోడు కంపచెట్లు పెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది.

– తుప్పర రవీందర్, ఎస్సీ కాలనీ, కొత్తూరు

మినీ ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి చేయాలి



పట్టణానికి కూతవేటు దూరంలో నివాస గృహాలకు ఆనుకొని ఉన్న కాశన్నకుంట చెరువును అధికారులు మినీట్యాంక్ బండ్‌లా అభివృద్ధి చేయాలి. అభివృద్ధి చేస్తే పట్టణ ప్రజలకు కాలక్షేపంతో పాటు ఇతర ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది.

– రవినాయక్, కొత్తూరు